

ఎరువుల నిల్వలపై నిఘా

ప్రతి సోమ, గురువారాల్లో మండల వ్యవసాయాధికారులు అయిదు ఎరువుల దుకాణాలను తనిఖీచేయాలి. సేల్ పాయింట్ వద్ద నిలువల వివరాలతో యాప్‌లో ఫొటోలను నిక్షిప్తపర్చాలి. స్టాక్ రిజిస్టర్‌లో సంతకం పెట్టి ఫొటోలను మూడు రోజుల్లోగా అప్‌లోడ్ చేయాలి. పీవోఎస్ యంత్రాలు ఉపయోగిస్తున్నారా లేదా వివరాలు సేకరించాలి. డివిజన్ స్థాయిలో సహాయ సంచాలకుడు తన పరిధిలో వారానికి రెండు రోజులు అయిదు దుకాణాలు తనిఖీ చేసి ఎరువుల వివరాలు యాప్‌లో నమోదు చేయాలి. జిల్లా స్థాయిలో డీఏవోలు వివరాలు సేకరించి అప్‌లోడ్ చేయాలి. ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం ఎరువుల దుకాణం నిర్వహణ ఉందా లేదా అనేది తనిఖీ ద్వారా తెలుస్తుంది. పంటల నమోదుకు ప్రత్యేక యాప్ ఉంటుంది. ఆ పంటలకు సరిపడా ఫర్టిలైజర్ వినియోగంపై ఫైల్ యాప్ ద్వారా సమగ్ర వివరాలు తెలుసుకోవచ్చు. జిల్లా కలెక్టర్, డీఏవో మాత్రమే ఈ యాప్‌లో లాగిన్ వెసులుబాటు ఉంటుంది. తద్వారా పర్యవేక్షణ అన్నది పకడ్బందీగా ఉంటుంది.

వివరాలు పక్కాగా..

- ఎరువుల తనిఖీకి నూతన విధానం
- నిలువల్లో తేడా రాకుండా ప్రత్యేక దృష్టి
- వారానికి రెండు రోజులు దుకాణాల్లో అధికారుల తనిఖీ
- జిల్లాలో ప్రారంభమైన ప్రక్రియ

పెంచికలపేట, ఫిబ్రవరి 24: ఎరువుల నిలువలను ఖచ్చితంగా తెలుసుకునేందుకు ప్రభుత్వం ఫైల్స్(ఫెర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం) పేరిట నూతనయాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈ ప్రక్రియ ప్రారంభమైంది. అందుకుగాను వ్యవసాయాధికారులు ఈ విధానంపై కసరత్తు చేస్తున్నారు. ఇంతకు ముందు యూరియా, డీఏపీ, ఇతర ఎరువుల కొరతపై దృష్టిసారించి ఎరువుల కొరతకు గల కారణాలు ఏమిటన్న దానిపై పరిశీలించి క్షేత్రస్థాయిలో లోపాలను గుర్తించి మరింత పారదర్శకంగా ఉండేలా చర్యలు చేపట్టారు.

యంత్రాల్లో ఒకలా... నిలువలు మరోలా

ఎరువుల విక్రయం మొత్తం పీవోఎస్ యంత్రాల ద్వారానే చేయాలనే నిబంధనలు ఉన్నా కొన్నిచోట్ల డీలర్లు, ఎరువుల దుకాణాల నిర్వాహకులు విస్మరిస్తున్నారు. పీవోఎస్ యంత్రాల్లో చూపించిన ఎరువుల నిలువలకు, భౌతిక నిలువలకు మధ్య వ్యత్యాసాన్ని ఉన్నతాధికారులు గమనించారు. యంత్రాల్లో భారీగా నిలువలు కనిపించడంతో సరిపడా నిలువలు ఉన్నాయని భావించినా వాస్తవానికి భౌతికంగా నిలువలు లేకపోవడంతో గతంలో రైతులకు ఎరువుల కొరత తలెత్తింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన ప్రభుత్వం తిరిగి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఫైల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది.



ఎరువుల దుకాణాలను తనిఖీ చేస్తున్న ఏడీఏ రాజుల నాయుడు (ఫైల్)

తొలగనున్న ఇక్కట్లు..

వానాకాలం, యాసంగి పంటలలో ఎరువుల వినియోగం ఎక్కువ. డీఏపీ, యూరియాను విరివిగా వాడుతుంటారు. కొత్త ఎరువుల తనిఖీ విధానం కారణంగా ప్రభుత్వం వద్ద ఎక్కడెక్కడ నిలువలు ఎంత ఉన్నాయో ఖచ్చితమైన లెక్క ఉంటుంది. ఎక్కడ కొరత ఉందో అక్కడ సరఫరాను మెరుగు పర్చుకోవడానికి అవకావం ఉంటుంది. దీంతో రైతులకు ఎరువుల కొరత ఇబ్బందులు తలెత్తవు.

జిల్లా వివరాలు: ఎరువుల దుకాణాలు - 409
ఆగ్రో కేంద్రాలు- 21, పీఏసీఎస్- 12

తనిఖీ చేస్తున్నాం..: రాజుల నాయుడు, ఏడీఏ, పెంచికలపేట



ఎరువుల దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం. నూతన యాప్ అందుబాటులోకి రావడం వల్ల రైతులకు ప్రయోజనం ఉంటుంది. అవసరమైన ఎరు వులు తెప్పించుకునే అవకాశం ఉంటుంది. రైతులకు సకాలంలో ఎరువులు అందుబాటులో ఉంచడానికి ఉపయోగపడుతుంది.

సింగరేణి సీఎండీని కలిసిన ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24: ఇటీవల సింగరేణి సీఎండీగా నియమితులైన బలరాం నాయక్‌ను హైదరాబాద్‌లోని సీఎండీ కార్యాలయంలో శనివారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలో సింగరేణి బొగ్గుగనులలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు.



సీఎండీకి బుట్ట అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

బీజేపీ ఎస్టీ మోర్చ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా కొట్నాక విజయ్‌కుమార్

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24: కొట్నాక విజయ్‌కుమార్‌ను బీజేపీ ఎస్టీమోర్చ రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా శనివారం రాష్ట్రనాయకత్వం నియమించింది. విజయ్‌కుమార్ గతంలో బీజేపీజిల్లా ప్రధానకార్యదర్శిగా పనిచేసి అసెంబ్లీ ఎన్నికల్లోపార్టీ టికెట్ ఆశించి భంగపడ్డారు. పార్టీ పదవికి రాజీనామా చేసి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచారు. అనంతరం తిరిగి బీజేపీలో చేరారు. తాజాగా రాష్ట్రకమిటీవిస్తరణలో ఎస్టీమోర్చ రాష్ట్రప్రధానకార్యదర్శిగా ఆయ నను నియమించారు.



కొట్నాక విజయ్

బైక్ అదుపు తప్పి ఒకరి మృతి

సిర్పూరు(టి), ఫిబ్రవరి 24: మండలంలోని వేంపల్లి గ్రామం వద్ద శుక్రవారం రాత్రి చింతలమానేపల్లి డబ్బా గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై కాగజ్‌నగర్‌కు వెళ్లుతుండగా వేంపల్లి వద్ద అదుపుతప్పి కింద పడిపోయారు. ఈ సంఘటనలో లెండుగురే అజయ్(20) అక్కడికక్కడే మృతిచెందాడు. మరో ఇద్దరు రాజు, శ్రీశైలంకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే వారిని చికిత్స నిమిత్తం కాగజ్‌నగర్ ఆసుపత్రికి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యులిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రమేష్ తెలిపారు.

వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

సిర్పూరు(టి), ఫిబ్రవరి 24: సిర్పూరు(టి) శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి పల్లకి శోభాయాత్ర నిర్వహించారు. మాఘశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టారు. శోభాయాత్రలో ఆలయ పూజరి గంగుసత్యనారాయణ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు విద్యాసంస్థలకు సెలవు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24: ఈనెల26న సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా జిల్లాలోని ప్రభుత్వప్రైవేట్ విద్యానంస్థలకు సెలవు మంజూరు చేశామని కలెక్టర్ హేమంత్ బోర్కడె శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకుగాను ఏప్రిల్ 13వ తేది 2వ శనివారం ప్రభుత్వప్రవేట్ విద్యాసంస్థలు యధావిధిగా నిర్వహించాలన్నారు.

ముగిసిన సమ్మక్క సారలమ్మ జాతర

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 24: కాగజ్‌నగర్ పెద్దవాగు సమీపంలో మూడు రోజులుగా కొనసాగిన సమ్మక్క, సారలమ్మ జాతర శనివారంతో ముగిసింది. శనివారం రాత్రి వరకు కూడా భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కాగజ్‌నగర్, సిర్పూరు(టి), కౌటాల, ఆసిఫాబాద్, రెబ్బెన ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ముగింపు సందర్భంగా జాతర కమిటీ అధ్యక్షుడు తుమ్మ రమేష్ జాతరకు సహకరించిన అధికారులకు, భక్తులకు, పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

పోలింగ్‌కేంద్రాల వద్ద సౌకర్యాలు కల్పించాలి

లింగాపూర్, ఫిబ్రవరి 24: పోలింగ్ కేంద్రాల వద్ద సకలసౌకార్యాలు కల్పించాలని తహసీల్దార్ రాజేంద్రప్రసాద్‌వర్మ అన్నారు. శనివారం ఆయన లింగాపూర్ మండలంలోని 16 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు రానున్న పార్లమెంట్ ఎన్నికల దృశ్యా ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సౌకర్యాలు ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని ఆయన మండల అధికారులకు సూచించారు. మండలంలో మొత్తం 16 పోలింగ్ కేంద్రాలను ఏర్పటు చేశామని తెలిపారు. ఆయన వెంట గిర్దవర్‌లు ప్రకాష్, ప్రదీప్ తదితరులు ఉన్నారు.

విద్యార్థిని మృతికి కారకులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24: ఆసిఫాబాద్ మైనార్టీ గురుకుల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న షేక్ అంజుమ్ మృతికి గురుకుల సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని శనివారం ముస్లిం వెల్ఫేర్ సొసైటీ నాయకులు అదనపుకలెక్టర్ దీపక్ తీవారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు తారిక్, అమర్‌బిన్ అబ్దుల్లా నిసార్, ఇస్లాం తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న సొసైటీ సభ్యులు



సమ్మక్క గద్దె వద్ద మొక్కులు సమర్పిస్తున్న భక్తులు

చివరి రోజూ.. అదే జోరు..

- చివరిరోజూ మేడారానికి పోటెత్తిన భక్తులు
- తల్లులను దర్శించుకున్న స్పీకర్
- ప్రశాంతంగా దేవతల వనప్రవేశం
- ముగిసిన నాలుగు రోజుల జాతర
- ఊపిరి పీల్చుకున్న అధికారులు

మేడారం, ఫిబ్రవరి 24 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు చివరి రోజు కూడా భక్తులు లక్షల సంఖ్యలో తరలివచ్చారు. శనివారం సాయంత్రం తల్లులు వన ప్రవేశం చేయనుండడంతో వనదేవతలను దర్శించుకునేందుకు రాష్ట్రంలోని నలుమూలల నుంచి, అదేవిధంగా పొరుగు రాష్ట్రాలైన మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిశా నుంచి భక్తులు భారీ ఎత్తున చేరుకున్నారు. దీంతో క్యూలైన్లన్నీ కిటకిలాడాయి. గద్దెల ప్రాంగణం ఇసుకవేస్తే రాలనంతగా భక్తులతో కిక్కిరిసి పోయింది.

ప్రముఖుల రాక

మేడారానికి శనివారం కూడా ప్రముఖుల తాకిడి కొనసాగింది. రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ సమ్మక్క, సారలమ్మను దర్శించి మొక్కులు చెల్లించారు. హెలిక్యాప్టర్ ద్వారా మేడారానికి చేరుకున్న ఆయనకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ స్వాగతం పలికారు. స్పీకర్ తొలుత తులాభారం ద్వారా ఎత్తుబంగారాన్ని సమర్పించారు. అనంతరం తల్లుల గద్దెల వద్దకు వెళ్లి పూజలు చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ సైతం వనదేవతలను దర్శించుకున్నారు.



తల్లుల వనప్రవేశం

తల్లుల వనప్రవేశం ప్రశాంతంగా జరిగింది. శనివారం సాయంత్రం 5 గంటలకు సమ్మక్కను ప్రధాన పూజారి కొక్కెర క్రిష్ణయ్య చిలుకలగుట్టకు, సారలమ్మను కాక సారయ్య కన్నెపెల్లికి, అలాగే గోవిందరాజులను కొండాయి, పగిడిద్దరాజును పూనుగొండ్లకు తరలించారు. దీంతో మేడారం మహాజాతర ముగిసింది.

ఆంధ్రజ్యోతి వన-జన జాతర February 21-24 2024

ధన్యవాదాలు తెలిపిన సీతక్క

జాతరను విజయవంతం చేయడానికి సహకరించిన రాష్ట్ర ప్రభుత్వానికి, వివిధ శాఖల అధికారులకు మంత్రి సీతక్క కృతజ్ఞతలు తెలిపారు. జాతర ముగింపు సందర్భంగా శనివారం మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. జాతర నిర్వహణకు అత్యధిక నిధులు ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. కలెక్టర్, ఎస్పీ, ఇతరశాఖల అధికారులను అభినందించారు.

సంప్రదాయ ఊరేగింపు

సమ్మక్క, సారలమ్మ జాతర ముగుస్తుండడంతో చివరి రోజు శనివారం మేడారంలో ఆదివాసీలు సంప్రదాయ ఊరేగింపు నిర్వహించారు. వివిధ కోయ జాతుల వారు సుమారు 300 మంది సంప్రదాయ దుస్తులు ధరించి ఉదయం సమ్మక్క గద్దెల వద్దకు చేరుకున్నారు. ఆదివాసీ పద్ధతిలో పూజలు చేశారు. అక్కడి నుంచి డోలు వాయిద్యాలు, డప్పు చప్పుళ్లు, కొమ్ముబూరలతో సంప్రదాయ నృత్యం చేస్తూ ముందుకు సాగారు. శివసత్తులు పూనకాలతో శిగాలూగారు.

ముగిసిన మహాజాతర

అంగరంగ వైభవంగా సాగిన మేడారం మహాజాతర శనివారం ముగిసింది. నలుగురు దేవతల వనప్రవేశంతో నాలుగు రోజుల సంరంభానికి తెరపడింది. భక్తులు తిరుగుబాట పట్టడంతో మేడారంలో గుడారాలన్నీ ఖాళీ అయ్యాయి. జన ఘోషతో హోరెత్తిన జాతర ప్రాంతం తిరిగి నిశ్శబ్దం ఒడిలోకి జారిపోయింది. 'రెండేళ్లకు మళ్లీ వస్తాం తల్లీ.. కరుణించు' అంటూ మొక్కుకుంటూ భావోద్వేగంతో స్వగ్రామాల బాట పట్టారు.



చిన్నారికి జంపన్న జలాలతో పుణ్యస్నానం..



తిరుగుప్రయాణంలో బై బై చెప్తున్న భక్తులు



ఆర్టీసీ బస్సుల్లో తిరుగు ప్రయాణమైన భక్తులు



ఆర్టీసీ ప్రాంగణానికి వెళ్తున్న భక్తులు



జంపన్నవాగులో పుణ్యస్నానమాచరించి తల్లులకు మొక్కుతున్న భక్తులు



మేడారం వెళ్లే రహదారిపై బారులుదీరిన వాహనాలు

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఏసీసీ, ఫిబ్రవరి 24: మంచిర్యాల పట్టణంలోని ఏసీసీ సబ్ స్టేషన్, రాజీవ్‌నగర్ సబ్ స్టేషన్‌ల పరిధిలో 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏడీఈ స్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌ల పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

జన్నారం, ఫిబ్రవరి 24: మండంలోని కలమడుగు గ్రామంలో నర నారాయణ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేశారు. 108 హోమాలను నిర్వహించారు. జడ్పీటీసీ ఎర్ర చంద్ర శేఖర్ హాజరైపూజలు చేశారు. అనంతరం గ్రామాల యువకులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు.

సేవాలాల్ జయంతిని విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 24: సంత్ శ్రీ సేవాలాల్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని సేవాలాల్ మహారాజ్‌ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సపాట్ శంకర్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌నాయక్ అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం వారు మాట్లాడుతూ ఈ నెల 27న సేవాలాల్ జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని నిర్ణయం తీసుకోవడం హర్షణీయమని చెప్పారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని శ్రీనివాసగార్డెన్ వెనకాల శ్రీనివాస కాలనీలో వేడుకలను నిర్వహించేందుకు నిర్ణయించామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పంతులు నాయక్, నందు నాయక్, సత్యనారాయణ నాయక్, రాజ్‌కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుపై దాడిని ఖండిస్తున్నాం

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 24: సీనియర్ జర్నలిస్టు శంకర్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆల్ డెమోక్రటిక్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తీగల శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజాలు చెప్పే జర్నలిస్టులపై ఇలా బౌతిక దాడులు చేయడం దారుణమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో జర్నలిస్టులపై అక్రమ కేసులు పెట్టడంతో పాటు బౌతిక దాడులు జరిగాయని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ భౌతిక దాడులు జరుగుతున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి స్పందించి దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

సజావుగా టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష

ఏసీసీ, ఫిబ్రవరి 24: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్ష శనివారం సజావుగా ముగిసిందని డీఈవో యాదయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని రెండు పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశారు. డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షకు ఉదయం 343మందికి గాను 250 మంది , మధ్యాహ్నం 343మంది విద్యార్థులకు 249 మంది పరీక్షకు హాజరయ్యారు. అసిస్టెంట్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఎగ్జామినేషన్ దామోదర్ పరీక్ష కేంద్రాలను పరిశీలించారు.

విద్యార్థులకు అభినందన

ఏసీసీ, ఫిబ్రవరి 24: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికైన జిల్లా కేంద్రంలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు విశ్వతేజ, అర్జున్‌ను శనివారం పలువురు అభినందించారు. ఈ నెల 26 నుంచి 29 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో నిర్వహించేటోర్నమెంట్‌లో వీరు పాల్గొంటారని హెడ్మాస్టర్ జోబిన్ తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ రాజేందర్, విలాస్‌కుమార్, అక్షయ్, అనూష, చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, రాజు పాల్గొన్నారు.

ప్రెస్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 24: రామకృష్ణాపూర్ ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సాయంత్రం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కమిటీ సభ్యులు ప్రకటించారు. అధ్యక్షుడిగా పిలుమాల్ల గట్టయ్య, ప్రధాన కార్యదర్శి గంగారపు గౌతం కుమార్, కోశాధికారి మారపెల్లి వేణుగోపాల్ రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా తాండ్ర సతీష్, వెంగళదాస్, సంతోష్ కుమార్ ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారుడిగా ఈదునూరి సారంగరావు, కార్యనిర్వాహణ అధ్యక్షుడిగా అరెల్లి గోపికృష్ణ, ఉపాధ్యక్షుడిగా నాంపల్లి గట్టయ్య, ప్రచార కార్యదర్శిగా కొండ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి గా బండ అమర్నాథ్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని వారు తెలిపారు. అధ్యక్షుడు పిలుమాల్ల గట్టయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నుండి జర్నలిస్టులకు రావాల్సిన సంక్షేమ పథకాల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో సభ్యులు పీడీ ప్రసాద్, గంగన్న, స్వామి, సదానందం, శ్రీనాథ్, రవి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి


దేవేందర్‌రెడ్డి, సైఫ్ (ఫైల్)

చెన్నూరు, ఫిబ్రవరి 24: మండలంలోని కత్తెరశాల బ్రిడ్జి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. చెన్నూరు మండలం ఒత్కులపల్లి గ్రామానికి చెందిన కంకణాల దేవేందర్‌రెడ్డి (ఆర్ఎంపీ) అవసరం నిమిత్తం తన బైక్‌పై చెన్నూరుకు వచ్చి తిరిగి తన స్వగ్రామానికి వెళ్తున్నాడు. బైక్ వెనుకాల స్కూటీపై పట్టణంలోని లైన్ గడ్డ ప్రాంతానికి చెందిన ఫ్రిజ్ మెకానిక్‌లు సైఫ్, అద్నాన్‌లు అంగ్రాజ్‌పల్లి గ్రామానికి ఫ్రిజ్ రిపేరు చేసేందుకువెళ్తున్నారు. ఇదే సమయంలో ఆస్నాద వైపు నుంచి చెన్నూరు వైపుకు వస్తున్న గూడ్స్ వాహనం కత్తెరశాల బ్రిడ్జి వద్ద వేగంగా వచ్చి ఎదురుగా వస్తున్న బైక్, స్కూటీలను ఢీకొట్టి బోల్తా పడింది. బైక్‌పై ఉన్న కంకణాల దేవేందర్‌రెడ్డి (38), స్కూటీపై ఉన్న సైఫ్(20) అనే వ్యక్తులు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. మరో యువకుడు అద్నాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించారు. గూడ్స్ వాహనం డ్రైవర్ అతి వేగం, అజాగ్రత్త వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు చెబుతున్నారు. ప్రమాదంలో బైక్, స్కూటీ నుజ్జునుజ్జయ్యాయి. సమాచారం మేరకు చెన్నూరు సీఐ రవీందర్ సంఘటన స్థలానికిచేరుకుని పంచనామా నిర్వహించి దేవేందర్, సైఫ్‌ల మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహాలను ధ్వంసం చేయడం సరికాదు


నినాదాలు చేస్తున్న దళిత బహుజన సంఘాల నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 24: మంచిర్యాల జిల్లాలో బహుజన మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయడం సరికాదని దళిత బహుజన సంఘాల నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో పలువురు మాట్లాడారు. మూడు రోజుల క్రితం కోటపల్లి మండలంలోని బోరంపల్లిలో పూలే విగ్రహాలను దుండగులు ధ్వంసం చేయడం హేయమైన చర్య అన్నారు. విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. త్వరలో బోరంపల్లి గ్రామాన్ని సందర్శించి ప్రజలకు సంఘీభావం తెలుపుతామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డుర్కె మోహన్, లాల్‌కుమార్, రంగు రాజేశం, దుర్గం రామ్మూర్తి, తోకల రాజేశం, గోమాస సందీప్, ఎల్లయ్య, భవానీ, సుధీర్, నరేందర్, రంజిత్‌కుమార్, ప్రకాష్, గోపినాధ్, అరుణ, కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఒత్తిడిని జయించాలి

నస్పూర్, ఫిబ్రవరి 24 : పదో తరగతి విద్యార్థులు ఒత్తిడిని జయించి ఉత్తమ ఫలితాలను సాధించాలని నస్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు సమత అన్నారు. పట్టణంలోని తీగల్‌పహాడ్ జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం పదో తరగతి విద్యారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు రామన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం నిర్వహించాలి

ఏసీసీ, ఫిబ్రవరి 24: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28న జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన పాఠశాలల్లో సైన్స్ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య శనివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. సైన్స్ పట్ల విద్యా ర్థుల ఆసక్తిని పెంచే కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు.

ఒకరి అదృశ్యం

భీమిని, ఫిబ్రవరి 24 : మహారాష్ట్రలోని చంద్రాపూర్‌కు చెందిన ఆధిర్ సర్కార్ అనే వ్యక్తికనపడుట లేదని కుటుంబ సభ్యులు శనివారం ఫిర్యాదు చేశారు. ఆధిర్ సర్కార్ భీమిని మండలంలోని కమలాపూర్ ప్రాజెక్ట్ వద్ద కాగజ్‌నగర్ కు చెందిన వసీమ్ ఖాన్ వద్ద చేపల పెంపకం కోసం ప్రాజెక్ట్ వద్ద వాచ్‌మెన్ గా పని చేస్తూ ఉన్నాడు. ఇదే క్రమంలో అక్కడ ఉంటూనే ఈ నెల 22 న సాయంత్రం నిత్యావసర సరకుల కోసం భీమిని వెళ్తున్న అని చెప్పి మరల ఇంటికి తిరిగి రాలేదని, ఫిర్యాదు చేశారు. తల్లి రజిత సర్కార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రశాంత్ తెలిపారు.

సీఎంను కలిసిన ఎమ్మెల్యే

బెల్లంపల్లి, ఫిబ్రవరి 24: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం రాత్రి హైదరాబాద్‌లో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ , బీసీ మైనార్టీ విభాగ సలహాదారుడు షబ్బీర్ ఆలీతో కలిసి సీఎంను ఎమ్మెల్యే కలిశారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం

దండేపల్లి, ఫిబ్రవరి 24: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి నరేంద్రమోదీతోనే సాధ్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి మంచిర్యాల జిల్లా కేంద్రంలో విజయ సంకల్ప యాత్ర బహిరంగ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన జిల్లా రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు మోటపల్కుల గురువయ్యతో పాటు మండలానికి చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరారు. మాజీ జడ్పీటీసీ మంద రాజయ్య, మాజీ వైస్ ఎంపీపీ చిట్ల శ్రీనివాస్, మాజీ మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎండి ఫయాజ్, నంబాల బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు గోపె రాయమల్లు, నాయకులు ఆడప సంతోష్, తోట రమణయ్య, సత్తయ్య, సతీష్ చేరినట్లు బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి రాజయ్య తెలిపారు.

విద్యార్థులకు అవగాహన

బెల్లంపల్లి, ఫిబ్రవరి 24: బెల్లంపల్లి పట్టణంలోని వాల్యూపిచ్ సాఫ్ట్‌వేర్ కంపెనీలో శనివారం బెల్లంపలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ అనుమతితో 4,6 సెమిస్టర్ల విద్యార్థులు 20 మంది , ఇద్దరు అధ్యాపకులు చంద్రశేఖర్, రామ రాజుల ఆధ్వర్యం లో కంపెనీని సందర్శించారు. ఈ సందర్భంగా వాల్యూపిచ్ కంపెనీ డైరెక్టర్ కిరణ్ మృదుల, సీటీవో రఘుబాబులు విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం , ఆర్టిఫిషియల్ ఇంటెలి జెన్స్ గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో కంపెనీ హెచ్ఆర్ రజిని, కో ఆర్డినేటర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు

నెన్నెల, ఫిబ్రవరి 24: నకిలీ పత్తి విత్తనాలు విక్రయం, అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్, నెన్నెల ఎస్సై శ్యామ్ పటేల్ హెచ్చరించారు. మండలంలో నకిలీ విత్తనాలు విక్రయిస్తూ గతంలో పట్టుబడ్డ 11 మందిని శనివారం తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఇకపైన నేరానికి పాల్పడితే రూ. లక్ష జరిమాన చెల్లించేలా వారి నుంచి బాండ్‌పై రాతపూర్వక హామీ తీసుకున్నారు.

సైబర్ మోసాలపై అవగాహన పెంచుకోవాలి

నెన్నెల, ఫిబ్రవరి 24: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అగాహన పెంచుకోవాలని బెల్లంపల్లి రూరల్ సీఐ అఫ్జలుద్దీన్ అన్నారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో శనివారం ఎస్సై శ్యామ్ పటేల్‌తో కలిసి విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. కస్టమర్ కేర్ నంబర్లను గూగుల్ నుంచి సేకరించి ఫోన్లు చేయొద్దని చెప్పారు. ఆ సంస్థల అధికారిక వెబ్‌సైట్‌లో సంప్రదించాలన్నారు. సైబర్ మోసానికి గురైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌వో కవిత తదితరులు పాల్గొన్నారు.

గాంధారి మైసమ్మకు ప్రత్యేక పూజలు


నదీ జలాలతో అమ్మవారి విగ్రహాన్ని శుద్ధి చేస్తున్న నాయక్‌పోడ్‌లు

రామకృష్ణాపూర్, ఫిబ్రవరి 24: గాంధారి మైసమ్మ జాతరలో రెండో రోజు శనివారం రాత్రి గోదావరి నదీ జలాలతో నాయక్‌పోడ్‌లు, గిరిజనులు అమ్మవార్ల విగ్రహాలను శుద్ధి చేసి ప్రత్యేక పూజలు చేశారు. గాంధారి ఖిల్లాపై కొలువు దీరిన మైసమ్మ తల్లి వద్ద పట్నాలు వేసుకొని లక్ష్మీదేవర ఆకారంలో బోనాలను వెంట పెట్టుకొని అమ్మవార్లకు ప్రత్యేక నైవేద్యాలు సమర్పించి గిరిజనులంతా పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఊట బావి వద్ద మంగళహార తులను తప్పెటగూళ్లను ఎదుర్కోళ్లుగా నిర్వహించారు. గాంధారి మైసమ్మ జాతరలో గిరిజన సాంప్రదాయాలలో అత్యంత ముఖ్య ఘట్టమైన తప్పెటగూళ్ల ఆటపాటలతో జాతర ప్రాంగణం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

జీవితంపై విరక్తితో వివాహిత ఆత్మహత్య

జన్నారం, ఫిబ్రవరి 24: మండలంలోని మురిమడుగు గ్రామంలో జీవితంపై విరక్తి చెంది వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. మురిమడుగు గ్రామానికి చెందిన రత్నం ఐశ్వర్య (21)కు రెండు సంవత్సరాల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో భర్తతో మనస్పర్థలు ఏర్పడి వేరుగా ఉంటుంది. ఇటీవల మళ్లీ భర్తతో ఫోన్‌లో మాట్లాడుతూ ఉంది. ఈ క్రమంలో రెండు నెలల క్రితం ఐశ్వర్య భర్త మరణించాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని తండ్రి రత్నం గంగరాజుతో చెబుతుండేది. ఈ క్రమంలో శనివారం గ్రామంలో ఒకరు చనిపోగా తండ్రి అంత్యక్రియలకు వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగింది. ఇంటికి వచ్చిన తండ్రి 108 అంబులెన్స్‌లో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాడు. వైద్యుల సూచన మేరకు లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందిందని వైద్యులు నిర్ధారించారు. మృతురాలు తండ్రి గంగరాజు ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

పత్తి మిల్లులో అగ్ని ప్రమాదం

చెన్నూరు, ఫిబ్రవరి 24 : మండలంలోని కిష్టంపేట గ్రామంలోని వరలక్ష్మీ జిన్నింగు మిల్లులో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. శనివారం పత్తిని అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తూ స్పార్కింగ్ కావడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో సిబ్బంది చెన్నూరులోని ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది ఫైరింజన్‌తో వచ్చి మంటలను ఆర్పివేశారు. స్వల్పంగా పత్తి కాలిపోయినట్లు అధికారులు తెలిపారు.

చెన్నూరులో మూడు ఇళ్లల్లో చోరీ

చెన్నూరు, ఫిబ్రవరి 24: పట్టణంలో మూడు ఇళ్లల్లో దుండగులు చొరబడి విలువైన వస్తువులను ఎత్తుకెళ్లారు. విశ్వకర్మ కాలనీలో శుక్రవారం రాత్రి కొమ్మెర బ్రహ్మయ్య ఇంట్లో చొరబడిన దొంగలు తులంన్నర బంగారం, రూ. 40 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపాడు. అవసరం నిమిత్తం గురువారం హైదరాబాద్‌కు వెళ్లానని శనివారం ఉదయం 4 గంటలకు ఇంటకి చేరుకోగానే ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయన్నారు. ఇంట్లోకి వెళ్తున్న క్రమంలో అక్కడే ఉన్న దొంగలు గోడ దూకి పరారయ్యారని చెప్పారు. జరిగిన సంఘటనపై 100కు డయల్ చేయగా పోలీసులు వచ్చి పరిశీలించినట్లు ఆయన తెలిపారు. రెండు రోజుల క్రితం ఆదర్శనగర్ కాలనీకి చెందిన ముల్కల వీరారెడ్డి, సిరంగి సంపత్‌ల కుటుంబాలు మేడారం జాతరకు వెళ్లగా దొంగలు చొరబడి నగదుతో పాటు వెండి, బంగారం ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ రవీందర్ తెలిపారు.

అతిగా మద్యం సేవించి యువకుడి మృతి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 24 : మండలంలోని చంద్రవెల్లి గ్రామానికి చెందిన ఎరిగేటి భీమేష్ (37) అనే యువకుడు అతిగా మద్యం సేవించి శనివారం మృతిచెందినట్లు తాళ్లగురిజాల పోలీసులు తెలిపారు. భీమేష్ తాండూర్ మండలంలోని అచ్చలాపూర్ గ్రామానికిచెందిన మిట్ట మల్లేష్ వద్ద పాలేరుగా నిచేస్తున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. అనారోగ్యానికి గురై శనివారం మృతిచెందినట్లు తెలిపారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

సిర్పూరు(టి), ఫిబ్రవరి 24: ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఓటు వజ్రాయుధమన్నారు. రానున్న ఎంపీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, ఎంపీవో కృష్ణమూర్తి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో రాంమోహన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగంపై కళాజాతా నిర్వహించారు.

తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 24: ఎస్పీఎం పునరుద్దరణ విషయంలో మాజీఎమ్మెల్యే కోనప్పపై చేసిన తప్పుడు ఆరోపణలు మానుకోవాలి కాంట్రాక్టుకార్మిక సంఘం నాయకుడు బానయ్య అన్నారు. శుక్రవారం రాత్రి స్థానికంగా ఆయన మాట్లాడారు. ఎస్పీఎం పునరుద్దరణకు మాజీఎమ్మెల్యే కోనప్ప ఎనలేని కృషి చేశాడన్నారు. కార్మికులను తప్పుతోవ పట్టించే విధంగా బీజేపీ నాయకులు ఆరోపణలు చేయటం మానుకోవాలన్నారు. ప్రసుతం అధికారంలో ఉన్న ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు కార్మికుల సమస్యలను ఎంతవరకు పరిష్కరిస్తారో తాము కూడా చూస్తామన్నారు.

బీఆర్ఎస్ హయాంలో ఎస్పీఎం కార్మికులకు అన్యాయం

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 24: ఎస్పీఎం కార్మికులకు బీఆర్ఎస్ హయాంలో పూర్తిగా అన్యాయం జరిగిందని కాంట్రాక్టు కార్మికసంఘం అధ్యక్షుడు గోలేం వెంకటేష్ ఆరోపించారు. శనివారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఎస్పీఎం పునరుద్దరణ బీఆర్ఎస్ హయాంలో జరిగినప్పుడు పూర్తిస్థాయిలో కార్మికులను ఎందుకు తీసుకోలేదన్నారు. దీనికి ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. అలాగే కాంట్రాక్టు కార్మికుల బకాయిలు ఎందుకు పూర్తి చెల్లించడం లేదన్నారు. నూతన జీవోలు ఎందుకు అమలు కాలేదని ప్రశ్నించారు. సమావేశంలో ట్రేడ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

భక్తజన సంద్రంగా.. గంగాపూర్ జాతర

రెబ్బెన, ఫిబ్రవరి 24: గంగాపూర్ శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి ఆలయ పరిసరాలు శనివారం భక్తజన సంద్రమయ్యాయి. ప్రతి సంవత్సరం మాఘశుద్ధ పౌర్ణమి నాడు తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీబాలాజీ వెంకటేశ్వరస్వామి నాలుగు గడియల పాటు గంగాపూర్ బాలాజీ ఆలయంలో కొలువు తీరి భక్తులకు కోరికలు తీరుస్తాడని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దీంతో శనివారం ఉదయం ఐదు గంటల నుంచి భక్తుల రాకమొదలైంది. సాయంత్రం వరకు సుమారు లక్ష మంది భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు సమర్పించుకున్నారు.

ప్రముఖుల రాక..

జాతరకు శనివారం కలెక్టర్ హేమంత్ బోర్కడే దంపతులతోపాటు ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూరు ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, అదనపు కలెక్టర్ వేణు, మాజీఎమ్మెల్యే ఆత్రం సక్కు, పలువురు జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రెబ్బెన మండల కేంద్రానికి చెందిన వ్యాపారులు ప్రకాష్ అగర్వాల్, నట్రాజ్, కృష్ణ, ప్రకాష్‌రావు, ఇతర వ్యాపారులు జాతరకు వచ్చిన భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.


జాతరకు పోటెత్తిన భక్తులు


స్వామి వారి రథాన్ని లాగుతున్న భక్తులు


మొక్కులు చెల్లించుకుంటున్న కలెక్టర్ దంపతులు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యే హరీష్ బాబు

భారీ బందోబస్తు..

జాతర సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఎస్పీ సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో డీఎస్పీ కరుణాకర్, స్పెషల్‌బ్రాంచ్‌సీఐ రాణా ప్రతాప్, రెబ్బెనసీఐ చిట్టిబాబు, ఆసిఫాబాద్ సీఐ సతీష్, వాంకిడి సీఐ శ్రీనివాస్, రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్, తిర్యాణి ఎస్సై రమేష్, సిర్పూరు ఎస్సై డీకొండ రమేష్ ఆధ్వర్యంలో వందమంది పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఘనంగా రథోత్సవం..

బాలాజీ వెంకటేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని శనివారం సాయంత్రం 6.15నిమిషాలకు రథోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారి ఉత్సవవిగ్రహాలను గర్భగుడి నుంచి భాజభజంత్రీలతో భక్తజన సందోహం మధ్య రథంపైకి తరలించారు. భక్తులు రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగుకుండా డీఎస్పీ కరుణాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు నిర్వహించారు.

పనులు చేయకుండా కాలయాపన చేస్తే ఊరుకునేది లేదు

● మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్ బాబు

కౌటాల, ఫిబ్రవరి 24: అధికారులు పనులు చేయకుండా కాలయాపన చేస్తే ఊరుకునేది లేదని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు అధికారులను హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎంపీపీ కార్యాలయంలో శనివారం ఎంపీపీ బసార్కర్ విశ్వనాథ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలో రోడ్లు బాగాలేవన్నారు. రైతులకు సాగు నీరందించేందుకు ప్రాణహిత ప్రాజెక్టు నిర్మించేలా తనవంతు ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి పోడురైతుకు పట్టాలు అందించేలా కృషి చేస్తానన్నారు. కౌటాల పీహెచ్‌సీలో వైద్యాధికారి, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు భర్తీచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీటీసీ మోతీరాం మాట్లాడుతూ.. గత సమావేశాల్లో పేర్కొన్న సమస్యలను నేటికీ పరిష్కరించలేదన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ కుమరం మాంతయ్య, తహసీల్దార్ పుష్పలత, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

దుండగులను కఠినంగా శిక్షించాలి


బెజ్జూరు, ఫిబ్రవరి 24: మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని బోరంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి మహాత్మాజ్యోతిబాపూలే, సావిత్రిబాయిపూలే విగ్రహాలను ధ్వంసంచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని శనివారం మండల కేంద్రంలో ప్రధానరహదారిపై మాలిసంఘం నాయకులు రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై విక్రం సంఘటనా స్థలానికి చేరుకొని దుండగులపై కఠినచర్యలు తీసుకుంటామని చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాలి సంఘం మండల అధ్యక్షుడు ఆదే అశోక్, ఉపాధ్యక్షుడు సెండె బాబురావు, నికాడి బాబురావు, తదితరులు ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 24: హైదరాబాద్ పబ్లిక్‌స్కూల్‌లో 2024-25విద్యా సంవత్సరానికి 1వతరగతిలో ప్రవేశంకోసం షెడ్యూల్డ్‌కులాల అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కూలాల అభివృద్ధి అధికారి సజీవన్ శనివారం ఒకప్రకటనలో తెలిపారు. పూర్తిచేసిన దరఖాస్తులను మార్చి12లోగా కార్యాలయంలో అందజేయాలన్నారు. మార్చి15న లాటరీపద్ధతిన విద్యార్థులను ఎంపిక చేస్తామన్నారు. పూర్తి వివరాల కోసం 7013397514 నంబర్‌ను సంప్రదించాలన్నారు. అర్హత, ఆసక్తిగల చిన్నారులతల్లిదండ్రులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీసీరోడ్డు పనులకు భూమిపూజ

చింతలమానేపల్లి, ఫిబ్రవరి 24: మండలంలోని బాబాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నుంచి మంజూరైన రూ.5లక్షల నిధులతో సీసీరోడ్డు నిర్మాణానికి ఎంపీపీ డుబ్బుల నానయ్య, కాంగ్రెస్‌పార్టీ మండల ఇన్‌చార్జీ అధ్యక్షుడు జునుగరి శేఖర్ శనివారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు లోడెల్లి ప్రవీణ్, బొర్కుట్ వెంకన్న, పోలాజీ రాజన్న, రాపెల్లి రామన్న, చాప్లె శ్రీను, వాగయ్య తదితరులు పాల్గొన్నారు.



ఉత్పత్తి పెంపుదలకు యాజమాన్యం దృష్టి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 24: నాలుగు రోజులుగా జరిగిన సమ్మక్క సారలమ్మ జాతర ఎఫెక్ట్ బొగ్గు ఉత్పత్తిపై పడింది. కార్మికులు మేడారాం జాతరకు పెద్దసంఖ్యలో తరలివెళ్లడంతో గనులకు గైర్హాజరయ్యారు. దీంతో ఉత్పత్తి తగ్గిపోయింది. జాతర పూర్తికావడంతో కార్మికులు విధులకు హాజరు కానున్నారు. ఈ ఆర్థికసంవత్సరం ఏరియాకు 46లక్షల టన్నుల లక్ష్యం నిర్దేశించగా ఇప్పటివరకు 40లక్షల టన్నుల ఉత్పత్తి సాధించినట్లు తెలుస్తోంది. మిగితా6లక్షల టన్నులు సాధించడానికి మరో నెలరోజుల సమయం మాత్రమే ఉంది. ఏరియాలోని శాంతిఖని కాసిపేట1,2గనులు, కేకే5 గనుల్లో లక్ష్యాలను పెంచేందుకు యాజమాన్యం ప్రత్యేకదృష్టి సారించింది. అధిక ఉత్పత్తి సాధించే కార్మికులకు ప్రోత్సాహకాలు అందించేందుకు యాజమాన్యం చూస్తోంది. ఇప్పటికే ఏరియా జీఎం మనోహర్ గనుల హెచ్‌వోడీలకు ఉత్పత్తి పెంపుపై సలహాలు, సూచనలు ఇచ్చారు. రక్షణ సూత్రాలు పాటిస్తూ ఉత్పత్తి సాధించాలని అన్నారు.

ఎస్టీపీపీకి అవార్డు

జైపూర్, ఫిబ్రవరి 24: దక్షిణ ప్రాంతంలో 500మెగావాట్ల కంటే ఎక్కువ వందశాతం యాష్‌వినియోగాన్ని సాధించినందుకుగాను జైపూర్ ఎస్టీపీపీకి మిషన్‌ఎనర్జీ ఫౌండేషన్ వారు అవార్డును ప్రకటించారు. ఎస్టీపీపీ ఈడీ బసివిరెడ్డి, ఓఅండ్ఎం జేఎన్ సింగ్ శనివారం గోవాలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అందుకున్నారు. సింగరేణిడైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణ మార్గదర్శకత్వంలో వందశాతం యాష్ వినియోగం సాధించామని వారు పేర్కొన్నారు. ఈ అవార్డు రావడంపట్ల సీఎండీ బలరాం, ఇతర అధికారులు అభినందించారు.

సింగరేణి అధికారులకు ఘన సన్మానం


ఎస్‌వోటు జీఎంను సన్మానిస్తున్న అధికారులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 24: పదోన్నతి, బదిలీ అయిన అధికారులను శనివారం జీఎం కార్యాలయం, ఆర్కే7 గనిపై అధికారులు ఘనంగా సన్మానించారు. ఎస్‌వోటు జీఎం కె రఘుకుమార్ జీఎం(రక్షణ), ఆర్‌కె7 గని మేనేజర్ సాయిప్రసాద్ క్వాలిటీ ఇన్ చార్జిగా రామగుండం రీజియన్‌కు, వెళ్తుండగా వారిని అధికారుల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. పదోన్నతికి వారి పనితీరే గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, ఇందారం ఓసీపీ పీవో ఎం శ్రీనివాస్, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, ఏరియా ఏజెంట్లు ఏవీరెడ్డి, గోపాల్‌సింగ్, రాముడు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు, ఏరియా రక్షణాధికారి శ్రీధర్‌రావు, క్వాలిటీఇన్‌చార్జి కె వెంకటేశ్వర్ రెడ్డి, ఏఐటీయూసీ నాయకులు ముష్కెసమ్మయ్య, బాజీ సైదా, కిషన్‌రావు, సారయ్య, రవీందర్ పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ సమస్యలపై చర్చ

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 24: న్యూఢిల్లీలో జరిగిన సీఎంపీఎఫ్ ట్రస్టీబోర్డు 180వ సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై చర్చించారు. కనీస పింఛన్ రూ.1000, సిబ్బంది నియామకం, ప్రాంతీయ కార్యాలయాల ఆధునీకీకరణ తదితర సమస్యలు, పీఎఫ్, పెన్షన్ చట్టాన్ని సవరించడానికి, బొగ్గు గని కార్మికులకు భవిష్యత్తులో సౌలభ్యం లభించేలా కమిటీ ఏర్పాటు చేసేందుకు నిర్ణయం తీసుకున్నారు. డీహెచ్ఎఫ్ఎల్ కుంభకోణంపై విచారణ ఓ కొలిక్కి వచ్చిందని, దోషులకు శిక్షపడే అవకాశం ఉందని తెలిపారు. సమావేశంలో ట్రస్టీబోర్డు సభ్యుడు, బీఎంఎస్ బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి కొత్తకాపు లక్ష్మారెడ్డి, ఆశిష్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నల్ ఉద్యోగులకు అవకాశం కల్పించాలి

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 24: సింగరేణి యాజమాన్యం ఉద్యోగభర్తీ నోటిఫికేషన్ ఇవ్వడం సంతోషదాయకమని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జె శంకర్‌రావు అన్నారు. అయితేపర్సనల్, సివిల్, ఫారెస్ట్, ఫైనాన్స్ తదితర విభాగాల్లో పనిచేస్తూ అర్హత కలిగిన ఇంటర్నల్ అభ్యర్థులకు మేనేజ్‌మెంట్ ట్రైనీలుగా ముందుగా అవకాశం ఇవ్వాలన్నారు. మిగిలిన వాటిలో మాత్రమే ఎక్స్‌టర్నల్ అభ్యర్థులతో భర్తీ చేయాలని కోరారు. కొత్తవారికి అనుభవలేమి కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని, ఇప్పటికే అనుభవం కలవారైతే వారికి గనులు, ఉత్పత్తిపై పూర్తి అవగాహన కలిగి ఉంటారని పేర్కొన్నారు. ఈ విషయంలో పునరాలోచన చేయాలని కోరారు.



ఎన్నికల విధులపై సెక్టార్ అధికారులకు అవగాహన

ఏసీసీ, ఫిబ్రవరి 24: లోక్ సభ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గపరిధిలోని ఎన్నికల సెక్టార్ అధికారులకు అవగాహన కార్యక్రమాన్ని శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ రానున్నందున అధికారులు ఎన్నికల విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు. అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. నోటిఫికేషన్ వచ్చేవరకు కొత్త ఓటర్లనమోదుకు అవకాశం కల్పించాలని సూచించారు. సమావేశంలో సెక్టార్ అధికారులు పాల్గొన్నారు.

అనుమతి లేని రసాయన కర్మాగారాన్ని తొలగించాలి

జైపూర్, ఫిబ్రవరి 24: ఇందారం గ్రామంలోని ఖాసీంపల్లిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన రసాయన కర్మాగారాన్ని తొలగించాలని బీఆర్ఎస్ నాయకులు అరికె సంతోష్ యాదవ్, ధర్మసమాజ్ పార్టీ చెన్నూరు నియోజకవర్గ నాయకుడు రేగుంట రాకేష్ శనివారం ఎంపీవో, గ్రామ ప్రత్యేకాధికారి అనిల్‌కుమార్, కార్యదర్శి సుమన్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఈ నెల 12న రసాయన కర్మాగారం నుంచి వెలువడిన వ్యర్థాల నీరు తాగి మూగ జీవాలు చనిపోయాయని వివరించారు. ఈ వ్యర్థాలను సైడ్ డ్రైనేజీలో విడువడం వల్ల ఆ పక్కనే ఉంటున్న ఆదివాసీ నాయకపోడ్‌ల ఇళ్ల వద్దకు, బ్రాహ్మణుల కుంట చెరువులోకి వ్యర్థాలు నేరుగా వెళ్తున్నాయని తెలిపారు. రసాయనాల వాసనకు ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నా రని, చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అందరి సహకారంతోనే జాతర విజయవంతం



మాట్లాడుతున్న ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 24: పట్టణంలోని పాలవాగు ఒడ్డున నాలుగు రోజులుగా నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతర విజయవంతమైందని ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. స్థానికంగా శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ జాతర విజయవంతం కావడం వెనుక అన్ని పార్టీలు, యూనియన్లతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారం ఉందని చెప్పారు. సీఎండీ బలరాం సూచనల మేరకు స్థానిక జీఎం మనోహర్ ఎప్పటికప్పుడు జాతరపై అన్ని డిపార్టుమెంట్లతో పాటు యూనియన్ నాయకులను కోఆర్డినేట్ చేశారని వివరించారు. జాతరలో ఏర్పాటు చేసిన హుండీలను త్వరలోనే లెక్కిస్తామని తెలిపారు. అనేక వ్యయప్రయాసాలకోర్చి జాతరలో భక్తులకు తాగు నీరు, స్నాన ఘాట్లు, తదితర ఏర్పాట్లు చేశామన్నారు. ఇబ్బందులు కలగకుండా జాతర ముగియడం సంతోషకరమని తెలిపారు. సమావేశంలో పీఎం శ్యాంసుందర్, ఈఅండ్ఎం నాగరాజు, గుర్తింపు సంఘం నాయకులు సలేంద్ర సత్యనారాయణ, అక్బర్ అలీ, దాగం మల్లేష్‌తో పాటు సీనియర్ పర్సనల్ ఆఫీసర్ వంశి, ఆర్కే 1ఏ మేనేజర్ జయంత్, తదితరులు పాల్గొన్నారు.

జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 24: సమ్మక్క సారలమ్మ జాతరకుప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసిందని ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య తెలిపారు. శనివారం పట్టణంలోని పాలవాగు ఒడ్డున వన దేవతలకు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, బత్తుల వేణు, కారుకూరి తిరుపతి, కమల్, సమ్మిరెడ్డి, మాచర్ల సంపత్, ఎస్ రాములు తదితరులు పాల్గొన్నారు.

అమ్మలు అడవిలోకి..





- ముగిసిన సమ్మక్క, సారలమ్మ జాతర
- వన ప్రవేశం చేసిన వనదేవతలు
- చివరి రోజు పెద్ద సంఖ్యలో భక్తుల రాక
- భక్తి పారవశ్యంలో శివసత్తులు
- ప్రత్యేక ఏర్పాట్లు చేసిన అధికారులు

శ్రీరాంపూర్‌లో పూజలు చేస్తున్న జీఎం

జిల్లాలోని పలు చోట్ల నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర శనివారం ముగిసింది. భక్తులను ఆశీర్వదించిన వన దేవతలు సాయంత్రం వనప్రవేశం చేశారు. భక్తుల పూనకాలు, భక్తి పారవశ్యం మధ్య దేవతలను నిజస్థానాలకు తీసుకెళ్లారు.

ఏసీసీ, ఫిబ్రవరి 24: జిల్లాలో సామ్మక్క సారలమ్మ జాతర ముగిసింది. జిల్లా కేంద్రంలోని గోదావరి తీరంలో ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్న సమ్మక్క సారలమ్మ జాతర శనివారంతో ముగిసింది. శనివారం మధ్యాహ్నం గద్దెల వద్ద కోయ పూజారులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సమీపంలోని ఇల్లారీల్లోకి దేవతలను చేర్చారు. జాతర ప్రశాంతంగా ముగియడంతో పోలీసు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారు. సుమారు 2 లక్షల మందికి పైగా భక్తులు వచ్చినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. జాతర విజయవంతానికి ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది, జాతర నిర్వహణ కమిటీ సభ్యులు ,దేవాదాయశాఖ అధికారులు, విద్యుత్, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ తదితర శాఖల అధికారులు నిర్విరామంగా కృషి చేశారు. భక్తులకు అసౌకర్యాలు కలుగకుండా సేవలందించారు. దేవతల వనప్రవేశం అనంతరం హుండీల లెక్కింపును దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో చేపట్టారు.

మందమర్రి టౌన్/ రామకృష్ణాపూర్: పట్టణం లోని పాలవాగు ఒడ్డున నాలుగు రోజులుగా సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మక్క సారలమ్మ జాతర ముగిసింది. శనివారం ముగింపు సందర్భంగా సింగరేణి అధికారులు, జాతర కమిటి సభ్యులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, డీజీఎం ఈఅండ్ఎం నాగరాజు దంపతులు పూజలు చేశారు. గిరిజన పూజారులైన దూలం కనకయ్యగౌడ్, మనోహర్‌ల నేతృత్వంలో పూజలు జరిగాయి. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో జాతర కమిటి నాయకులతో పాటు ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ నాయకులు కూడా ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ పూజల అనంతరం గిరిజన పూజారులు అమ్మవార్లను వన ప్రవేశం చేయించారు. ఈ వన ప్రవేశం సందర్భంగా పలువురు భక్తులు పూనకాలతో తూలిపోయారు. అంతే కాకుండా దేవతలను దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. అనంతరం వన దేవతలు వనప్రవేశం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలేంద్ర సత్యనారాయణ, అక్బర్ అలి, దాగం మల్లేష్, సోముశెట్టి రాజేషం, గాండ్ల సంపత్‌తో పాటు వినోద్, ఐఎన్టీయూసీ నాయకులు దేవి భూమయ్య, ఆర్కే 1ఏ మేనేజర్ జయంత్ పాల్గొన్నారు. ఏరియాలోని గనుల, డిపార్టుమెంట్లకు చెందిన ఏఐటీయూసీ నాయకులు మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గాండ్ల సంపత్, సోముశెట్టి రాజేషం, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: సమ్మక్క సారలమ్మలను దర్శించుకునేందుకు శని వారం చివరి రోజు ఆర్కే 1ఏ సమీపంలో నిర్వహిస్తున్న జాతరకు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పెద్ద సంఖ్యలో భక్తులు వన దేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శ్రీరాంపూర్: సీసీసీలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద ప్రతిష్ఠిం చిన సమ్మక్క, సారలమ్మల వన ప్రవేశం శనివారం జరిగింది. ఏరియా జీనరల్ మేనేజర్ బి సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశా రు. కార్యక్రమంలో ఎస్‌వోటు జీఎం కె రఘుకుమార్, డీజీఎం(పర్స నల్) అరవిందరావు, ఏజెంట్ రాముడు, ఎస్ఎస్‌వో మురళీమోహన్, పూజారి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.







మందమర్రిలో పూజలు నిర్వహిస్తున్న అధికారులు, సమ్మక్క సారలమ్మలను ఇల్లారికి తీసుకువెళ్తున్న కోయ పూజారులు, మందమర్రిలో అమ్మవార్లను వన ప్రవేశం చేయిస్తున్న భక్తులు

రాష్ట్రంలో 17 స్థానాల్లో బీజేపీదే విజయం

- కేంద్ర పథకాలను ప్రజలకు వివరించేందుకే సంకల్పయాత్ర
- ఆరు గ్యారెంటీలపై రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టత లేదు
- కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి



మంచిర్యాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

ఏసీసీ, ఫిబ్రవరి 24: రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ 17 స్థానాల్లో గెలవడం ఖాయమని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందన్నారు. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి కేంద్రంలో కాంగ్రెస్ గెలిస్తేనే ఆరు గ్యారెంటీల అమలు సాధ్యమని ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఆరు గ్యారెంటీలను ఎప్పటిలోగా అమలు చేస్తారో కాంగ్రెస్ పార్టీకే స్పష్టత లేదని ఎద్దేవ చేశారు. కేవలం లోక్‌సభ ఎన్నికల కోసమే కాంగ్రెస్ హామీలను అమలుచేస్తామని ప్రజలను మభ్య పెడుతుందన్నారు. ఆర్టీసీ భూములను 99 సంవత్సరాల లీజు పేరుతో దోచుకోవాలని చూస్తున్నార న్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని ఊదరగొడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం అందుకు కారకులైన వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సీబీఐ విచారణ జరిపిస్తామనిచెప్పి ఇప్పుడు ఎందుకు దాని ఊసు ఎత్తడం లేదన్నారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా దేశానికి కీర్తిప్రతిష్టలు మోదీతోనే వచ్చాయన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పల్లె గంగారెడ్డి, కొప్పు భాష ,వెంకటేశ్వర్‌గౌడ్, తుల ఆంజనేయులు, శ్రీదేవి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించి ప్రజలు సుస్థిర ప్రభుత్వ ఏర్పాటుకు సహకరించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపెల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. బీజేపీ విజయ సంకల్ప యాత్రలో భాగంగా శనివారం ఆయన పార్టీ రాష్ట్ర కార్యదర్శి, యాత్ర ఇన్‌చార్జి పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్‌తో కలిసి శ్రీరాంపూర్‌లోని ఎస్ఆర్‌పీ 3 గనిని సందర్శించారు. ముందుగా ఆయన కార్మికులను కలిసి వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం, అవినీతి రహిత పాలన బీజేపీతోనే సాధ్యమన్నారు. జిల్లా నలుమూలలా ఉన్న జాతీయ రహదారులే అభివృద్ధికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు తమవిగా చెప్పుకొని ఓట్లు పొందుతున్నాయని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులు గుర్తుంచుకోవాలన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను ఎంపీలుగా గెలిపించి, మళ్లీ మోదీని ప్రధానిని చేయాలని ఆయన కోరారు. సమావేశంలో బీజేపీ నస్పూర్ పట్టణాధ్యక్షుడు సత్రం రమేష్, నాయకులు కమలాకర్‌రావు, కడాసు భీమయ్య, మహేందర్, కుర్రె చక్రవర్తి, సత్యనారాయణ, రత్నం, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ క్షేత్రంలో విద్యార్థుల పర్యటన

భీమారం, ఫిబ్రవరి 24: మండలంలోని పోలంపల్లి గ్రామంలోని పొలాల్లో జగిత్యాల జిల్లా పొలాస వ్యవసా య కళాశాల విద్యార్థులు శనివారం పర్యటించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు శివకృష్ణ, నాగరాజులు వ్యవసాయ విద్యార్థులకు పంటల రకాలు, పంటల ఎదుగుదలకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు అక్బర్ ఖాన్, మనోజ్, విశాల్, ప్రణయ్, ఉబేద్, అరుణ్‌గౌడ్, శ్రీధర్, చంద్రమౌళి పాల్గొన్నారు.

ఘనంగా అన్నమాచార్యుల వర్ధంతి

చెన్నూరు, ఫిబ్రవరి 24: చెన్నూరులోని శ్రీరాధా కృష్ణమందిరంలో వికాస తరంగిణి, శ్రీనివాస భజన మండలి ఆధ్వర్యంలో శనివారం అన్నమాచార్యుల వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అన్నమాచార్యుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీ వెంకటేశ్వర స్వామిని తన పాటల ద్వారా మెప్పించి ఒప్పించిన విధానాన్ని కొనియాడారు. అనంతరం భజన మండలి సభ్యులు సంకీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో కట్ల శ్రీనివాసాచార్యులు , మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలి

హాజీపూర్, ఫిబ్రవరి 24: కూలీలు ఉపాధిహామీ పనులను సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. మండలంలోని రాపెల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో ఉపాధి హామీ పనులను శనివారం పరిశీలించారు. మట్టి రోడ్డు నిర్మాణపనులు, నర్సరీ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండలు పెరుగుతున్నందున కూలీలందరు ఉదయం 7 గంటలలోపు పనులకు హాజరు కావాలని చెప్పారు. త్వరగా పనులను ముగించుకోవాలని సూచించారు. రోజు కూలీ రూ. 272 వచ్చేలా పనులు చేయాలన్నారు. వెంట నీరు తెచ్చుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని ఈజీఎస్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రతి గ్రామంలో కనీసం 75 మంది పనిలోకి వచ్చేలా చూడాలని సూచించారు. కూలీలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం అధికారులు, సిబ్బంది డీఆర్‌డీవోను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మధుసూదన్, ఈసీ శ్రీనివాస్, కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

నల్ల బ్యాడ్జీలతో ఐఎఫ్‌టీయూ నాయకుల నిరసన



మాదారంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న నాయకులు

తాండూర్, ఫిబ్రవరి 24: పంజాబ్ రైతులపై హరియాణా పోలీసులు కాల్పులు జరపడాన్ని వ్యతిరేకిస్తూ శనివారం తాండూర్ మండలంలోని మాదారం టౌన్ షిప్‌లో ఐఎఫ్‌టీయూ నాయకులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకుడు రాజు మాట్లాడుతూ శాంతియుతంగా నిరసన తెలుపుతున్న రైతులపై రబ్బరు బుల్లెట్లతో పోలీసులు కాల్పులు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. పోలీసుల కాల్పుల్లో శుభకరన్ అనే యువకుడు మృతిచెందడం బాధకరమన్నారు. కేంద్రం రైతు వ్యతిరేక విధానాలను మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో ‑ాందేవ్, భరత్ కుమార్, బుచ్చన్న, సురేష్, శకుంతల, లక్ష్మీమల్లేశ్వరి, తిరుపతమ్మ, ఓదమ్మ, చంద్రమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో హరియాణా పోలీసులు రైతులపై కాల్పులు జరపడంపై నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి డి బ్రహ్మానందం మాట్లాడుతూ శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్న రైతులపై రబ్బరు బుల్లెట్లతో పోలీసులు కాల్పులు జరపడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు క్షమాపణ చెప్పి, మద్దతు ధర చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు అప్పారావు, శంకర్, సుధాకర్, రాజేశ్, సురేష్, రాంబాబు, రాము, శీను, శారద, కవిత, లక్ష్మి, సుప్రియ, శిరీష పాల్గొన్నారు.

సత్యదేవుడి సన్నిధిలో ప్రత్యేక పూజలు



గూడెంలో స్వామి వారి సామూహిక వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

దండేపల్లి, ఫిబ్రవరి 24: దండెపల్లి మండలం గూడెం శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయంలో శ్రీస్వామి వారిబ్రహ్మోత్సవాలు, మాఘశుద్ధ పూర్ణిమిని పురస్కరించుకుని శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు రఘుస్వామి, సంపత్‌స్వామి ఆధ్వర్యంలో వేద పండితులు అభిరామ్‌చార్యులు, నారాయణశర్మలు చాత్తాధ శ్రీ వైష్ణవ ఆచారా సంప్రదాయ ప్రకారం స్వామి వారికి జయాది హోమం, శాంతి హోమం, మహా పూర్ణహుతి, బలిహరణము, నిత్యవిధి, ప్రాభోధిక ఆరగింపు, తీర్థప్రసాదగోష్ఠి, హవనము, నిత్య హోమం నిర్వహించారు. భ్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. పలువురు సామూహిక స్వామి వ్రతాలను ఆచరించారు. భక్తులకు అన్నదానం నిర్వహించామని ఆలయ కార్యనిర్వహాధికారి సంకటాల శ్రీనివాస్ తెలిపారు.